చెత్తను వేరు చేయరూ!


స్వచ్ఛ ఆటోల్లో తడి, పొడి చెత్తను కలిపి తరలిస్తున్న ఆటో కార్మికుడు

తడి, పొడి చెత్త తరలింపులో ఆదేశాలు బేఖాతర్
- అవగాహన కల్పించినా శూన్యం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

తడి, పొడి చెత్త వేరు చేసి తరలించాలన్న జీహెచ్ఎంసీ కార్యాచరణ ఏళ్లు గడుస్తున్నా ఆచరణకు నోచుకోడం లేదు. ఇళ్ల నుంచి చెత్తను వేరు చేసి తరలించేందుకు గతంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో లక్షలాది నిధులు వెచ్చించి పెద్ద ఎత్తున ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అయినా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు మారడం లేదు. తడి, పొడి చెత్తను తరలించాలన్న అధికారుల ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదు.

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో జగద్గిరిగుట్ట, చింతల్, సూరారం, గాజులరామారం, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, సుభాష్‌నగర్, రంగారెడ్డినగర్ డివిజన్లు ఉన్నాయి. ఆయా కాలనీలు, బస్తీల నుంచి ప్రతి నిత్యం 300 మెట్రిక్ టన్నుల చెత్తాచెదారాలను సేకరిస్తున్నారు. వాటిని తడి, పొడి చెత్తగా వేరు చేసి సేకరించేలా జీహెచ్ఎంసీ అధికారులు స్వచ్ఛ ఆటో కార్మికులకు అవగాహన కల్పించారు. అయినా తడి, పొడి చెత్తను కలిపి ఆటో ట్రాలీల్లో జగద్గిరిగుట్ట సమీపంలోని హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశంలో రాంకీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెకండరీ కలెక్షన్ అండ్ వేస్ట్ ట్రాన్స్‌ఫర్ ప్లాంట్‌కు తరలిస్తున్నారు..

సేంద్రియ ఎరువు తయారీకి తూట్లు

◆ కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో 138, గాజులరామారం సర్కిల్ పరిధిలో 273 స్వచ్ఛ ఆటోలను సర్కిల్ అధికారులు కేటాయించారు. వీటి ద్వారా ఇళ్ల నుంచి చెత్తను సేకరించి ఎస్ఈటీపీ ప్లాంట్‌కు, అక్కడి నుంచి భారీ వాహనాల్లో జవహర్‌నగర్‌లోని ప్రధాన డంపింగ్ కేంద్రానికి చెత్తను తరలిస్తున్నారు. ఇళ్ల నుంచి వచ్చే తడి చెత్తను ఉపయోగించి సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. సేంద్రీయ ఎరువును జీహెచ్ఎంసీ పరిధిలో మొక్కలకు వినియోగించగా.. మిగతా ఎరువును విక్రయించి జీహెచ్ఎంసీ ఆదాయాన్ని పెంచుకునేందుకు చేసిన కార్యాచరణకు స్వచ్ఛ ఆటో కార్మికులు తూట్లు పొడుస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తడి, పొడి చెత్తను కలిపి వేస్తుండటంతో సేంద్రీయ ఎరువు తయారీ వీలు కావడం లేదు.

ప్లాస్టిక్, ఇతర వస్తువుల విక్రయంపైనే దృష్టి

చెత్త సేకరించే స్వచ్ఛ ఆటో కార్మికులు ఒక్కో ఇంటి నుంచి రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నారు. చెత్త సేకరణలో వచ్చే ప్లాస్టిక్, ఇతర వస్తువులను వేరు చేసి సమీపంలోని పాత ఇనుము సామాను దుకాణాల్లో విక్రయిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి తరలించకుండా జీహెచ్ఎంసీ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ అదనపు ఆదాయంపైనే దృష్టి సారిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్వచ్ఛ ఆటోవాలాలను నియంత్రించి సక్రమంగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

ఇళ్ల నుంచి చెత్తను సేకరించే స్వచ్ఛ ఆటో కార్మికులు తడి, పొడి చెత్తను వేరు చేసి తరలించాలని జీహెచ్ఎంసీ అధికారులు జారీచేసినా ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదు. మొదట్లో అధికారులు చొరవ తీసుకోవడంతో ఆటోట్రాలీలను రెండు సమభాగాలుగా విభజించి తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సేకరణ కార్మికులు తరలించారు. కొద్ది రోజుల పాటు సజావుగా కొనసాగినా ఆ తరువాత సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఈ ప్రక్రియలో చెత్త సేకరణకు బ్రేక్ పడింది. తడి, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోవాలాలకు అందించేందుకు ఇళ్లవాసులకు జీహెచ్ఎంసీ ఆకుపచ్చ, నీలం రంగు డబ్బాలను ఉచితంగా పంపిణీ చేసింది. చాలా మంది ఇళ్ల వాసులు తమ సొంత అవసరాలకు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది.

సమయపాలన మరిచారు


సుభాష్‌నగర్‌లో తాళం వేసి ఉన్న వార్డు కార్యాలయం

జీడిమెట్ల: సుభాష్‌నగర్ వార్డు కార్యాలయం అధికారులు సమయపాలన పాటించడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లోని పలు కాలనీల ప్రజలు ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా వార్డు కార్యాలయంలోని సిబ్బందికి విన్నవించుకుంటారు. కానీ వార్డు కార్యాలయంలో ముఖ్యంగా గ్యాస్ సబ్సిడీ గృహజ్యోతి వంటి సమస్యలు ఉంటే ఎంట్రీలు చేస్తుంటారు. సమయపాలన పాటించకుండా అధికారులు వారి ఇష్టం వచ్చినప్పుడు వస్తున్నారు. సమయానికి అందుబాటులో ఉండటం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా ఉన్నతాధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

యువత ఆదర్శంగా తీసుకోవాలి


తులసిరెడ్డిని సన్మానిస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్: పర్వత శిఖరాలు అధిరోహిస్తున్న తులసిరెడ్డిని యువత ఆదర్శంగా తీసుకోవాలని బౌరంపేట కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట ప్రాంతానికి చెందిన పల్పునూరి తులసిరెడ్డి ఐరోపా ఖండంలోని ఎత్తైన 5642 మీటర్ల మౌంట్ ఎల్బ్రస్ శిఖరాన్ని అధిరోహించి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డిని కౌన్సిలర్ బుధవారం సన్మానించారు.

చెరువును తలపిస్తున్న బహదూర్‌పల్లి ప్రధాన రోడ్డు


బహదూర్‌పల్లి ప్రధాన రోడ్డుపై చేరిన వరదనీరు

సుభాష్‌నగర్: నిత్యం రద్దీగా ఉండే ఆ రహదారిలో చినుకు పడిందంటే వర్షపు నీరు రోడ్డుపై వచ్చి చేరుతుంది. బహదూర్‌పల్లిలోని దూలపల్లి వెళ్లే రోడ్డును ఆనుకుని బోబాఖాన్ చెరువు నుంచి వెళ్లే కట్టు కాలువను కబ్జా చేయడంతో వర్షపు నీరు దిగువ ప్రాంతానికి వెళ్లేందుకు వీలు లేదు. వర్షం పడిన ప్రతిసారి ప్రధాన రోడ్డుపై నీరు చేరుతుంది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బుధవారం రోడ్డుపై నీరు నిల్వడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి కబ్జాకు గురైన కట్టు కాలువను కాపాడి వర్షపునీరు సులువుగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో ఈస్ట్ కాలనీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు

మోతీనగర్: సంక్షేమ సంఘాలు రాజకీయాలకు అతీతంగా స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇటీవల అవంతీనగర్ ఈస్ట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందిన పి. నర్సింహారెడ్డి బుధవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, తన్నీరు తిరుపతిరావు, అంకం వీరబాబు, తక్కళ్లపల్లి దేవందర్‌రావు, బండారి సుశీల్‌కుమార్ యాదవ్, రమేష్ చౌహాన్, రమణ, శర్మ, శ్రీకాంత్, శివ, వంశీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ నూతన కమిటీ ఎన్నిక

ఆల్విన్‌కాలనీ: ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర(పీఆర్‌టీయూ టీఎస్) కూకట్‌పల్లి మండల నూతన కమిటీని బుధవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎం. వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా సి. విఠల్, అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్. చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా పి. రవీంద్ర, మహిళా అధ్యక్షురాలిగా బి.రాధిక, కార్యదర్శిగా ఆర్. వీరేందర్, మహిళా కార్యదర్శిగా ఎస్ లక్ష్మి ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నత స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఎప్పటికప్పుడు చర్చిస్తానన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, వృద్ధులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: బోయిన్‌పల్లిలోని జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 50 సంవత్సరాలు పై బడిన వారికి రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, అజీర్ణం, అర్శ మొలలు తదితర వాటికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను కూడా అందజేశారు. కార్యక్రమంలో అధికారి శ్రవణ్, డాక్టర్ పార్వతి, వినోద రాణి, స్వరూప, ఆశా వర్కర్లు దివ్య, గుణ సుందరి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


అలుగును పరిశీలిస్తున్న కౌన్సిలర్ రవీందర్ యాదవ్

సుభాష్‌నగర్: మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి బుధవారం కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని తుమార్ చెరువు అలుగు పారింది. సమాచారం అందుకున్న కౌన్సిలర్ రవీందర్‌యాదవ్ గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. చెరువు అలుగు పారుతుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిన్నపిల్లలు అటువైపుగా వెళ్లవద్దని కౌన్సిలర్ సూచించారు.

ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ర్యాలీ

సుభాష్‌నగర్: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. సూరారంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నుంచి సూరారం మెయిన్ రోడ్డు వరకు మాలమహానాడు నాయకులు ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో దళిత సేన జాతీయ నాయకుడు జేమ్స్, మాలమహానాడు కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, అడ్వైజర్ బుచ్చన్న, ఆగమయ్య, రత్నం, డేవిడ్, నర్సింగ్‌రావు, భిక్షపతి, అరుణలత, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం పేట్‌బషీరాబాద్‌లో క్యాంప్ కార్యాలయానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు విచ్చేసి స్థానిక సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించారు. అదే విధంగా పలువురు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

◆ బాచుపల్లి డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు దాదాపు 50 మంది ఎమ్మెల్యేను కలిసి భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం, ప్రహరీ నిర్మాణం, కరెంటు సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన వివేకానంద్.. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. బీఆర్ఎస్ నాయకులు నదీమ్ రాయ్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు అశోక్, దుర్గా ప్రసాద్ తదితరులు


ఎమ్మెల్యే వివేకానంద్‌కు సమస్యను వివరిస్తున్న బాచుపల్లి డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులు

కూల్చివేతకు యత్నం.. అడ్డుకున్న నిర్మాణదారుడు

రంగారెడ్డినగర్: అక్రమ నిర్మాణాలను మొదట్లోనే అడ్డుకోకుండా నిర్మాణం పూర్తి దశకు చేరుకున్న తరుణంలో నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలకు తెరలేపడం వివాదాస్పదంగా మారుతోంది. తాజాగా రంగారెడ్డినగర్ డివిజన్ పంచశీల కాలనీలో తుది దశకు చేరుకున్న మూడంతస్తుల భవనం కూల్చివేత విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు భవన నిర్మాణదారుడికి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా బుధవారం జోనల్ కార్యాలయ సిబ్బంది కూల్చివేతలు చేపట్టేందుకు పంచశీల కాలనీకి వచ్చారు. దీంతో భవన నిర్మాణదారుడు స్థానికులతో కలిసి అధికారులను అడ్డుకున్నాడు. మొదట్లోనే నోటీసులు ఇస్తే అదనపు భవన నిర్మాణాన్ని చేపట్టే వాడిని కాదని, ఇప్పుడు మధ్యలో ఎలా కూలుస్తారంటూ వాపోయాడు. స్థానిక నాయకులు, కొందరు ప్రజాప్రతినిధులతో ఫోన్లలో మాట్లాడించడంతో తాత్కాలికంగా కూల్చివేతలకు అధికారులు బ్రేక్ వేసి వెళ్లిపోయారు.


టౌన్‌ప్లానింగ్ అధికారి, సిబ్బందిని అడ్డుకుంటున్న స్థానికులు

యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా దయాకర్


ఒక్కంటి దయాకర్

కుత్బుల్లాపూర్: బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఒక్కంటి దయాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పార్టీని బలోపేతం చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.

బాధ్యతల కేటాయింపు

సుభాష్‌నగర్: ఇటీవల కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వచ్చిన ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ ఖాన్ ఏరియాలను కేటాయించారు. విజయ్ కుమార్‌కు పేట్‌బషీరాబాద్, జీడిమెట్ల, సూరారం ప్రాంతాలు, గులాం ఖలీల్‌కు కుత్బుల్లాపూర్, నందానగర్, జగద్గిరి గుట్ట, గాజులరామారాన్ని కేటాయించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

కుత్బుల్లాపూర్: ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన మనీష్‌కుమార్ సింగ్(39) బాలానగర్‌లోని రాజు కాలనీలో నివాసముంటున్నాడు. దూలపల్లిలోని శ్రీదుర్గా మెటల్స్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా బుధవారం మనీష్‌కుమార్ డ్యూటీకి వెళ్లాడు. రాత్రి 9 గంటల ప్రాంతంలో పరిశ్రమకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతంతో స్పృహ తప్పి పడిపోయాడు. అతడిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ట్రాక్టర్ కంప్రెషర్ సీజ్


సర్వే నెంబరు 79లో బండరాళ్లను కటింగ్ చేస్తున్న దృశ్యం


ప్లాట్‌గా మార్చిన ప్రభుత్వ స్థలం

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్‌గా మార్చేందుకు ఓ వ్యక్తి అందులో ఉన్న బండరాలను తొలగిస్తున్న క్రమంలో ట్రాక్టర్ కంప్రెషర్‌ను రెవెన్యూ అధికారులు బుధవారం సీజ్ చేశారు. గాజులరామారం డివిజన్ నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 79లో ఓ వ్యక్తి టీబీసీకి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసేందుకు మూడు నెలల నుంచి ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. బండరాళ్లను తొలగించి సుమారు 300 గజాలను ప్లాట్‌గా చేశాడు. మిగతా స్థలంలో ఉన్న బండారాలను మూడు రోజులుగా తొలగిస్తుండగా.. సమాచారం అందుకున్న తహసీల్దార్ అబ్దుల్ రహమాన్ ఖాన్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం ఖలీల్ బుధవారం అక్కడికి చేరుకుని పనులను నిలిపి వేశాడు. కంప్రెషర్‌ను సీజ్ చేశారు. వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

గతంలో బండరాళ్లను పేల్చి..

సదరు వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు అందులో ఉన్న బండరాలను తొలగించేందుకు జూన్ 15న పేలుడు పదార్థాన్ని ఉపయోగించాడు. దీంతో ఒక్కసారిగా భారీ పేలుడుతో ఆ ప్రాంతం ఉలిక్కి పడింది. సమాచారం అందుకున్న అప్పటి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుక తమ సిబ్బందితో అక్కడ చేరికోగా.. సదరు వ్యక్తి పరారయ్యాడు. అప్పటి నుంచి సైలెంట్ గా ఉన్న వ్యక్తి గత 3 రోజుల నుంచి పనులు మొదలుపెట్టడంతో రెవెన్యూ అధికారులు చెక్ పెట్టారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

దుండిగల్: బౌరంపేట్‌లో హోమియోపతి సెంటర్‌లో మెడికల్ క్యాంప్‌ను కౌన్సిలర్ పీసరి బాలమణి, డాక్టర్లు లలిత, రాజమోహన్‌లతో కలిసి బీజేపీ మున్సిపల్ నాయకుడు కీసరి కృష్ణారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉచిత వైద్య క్యాంప్‌లు సీజనల్ వ్యాధులతో పాటు ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉపకరిస్తాయన్నారు. క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు, నరాల బలహీనత, కంటి, వినికిడి, శ్వాసకోశ, జననేంద్రియ, కిడ్నీ స్టోన్, మంకీ ఫాక్స్ ఇలా అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా సేవలు అందించేందుకు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీవల్లి, ఫార్మసిస్ట్ సంజీవరావు, మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, రామిరెడ్డి, ఆకుల ఈశ్వరయ్య పాల్గొన్నారు.


వృద్ధులకు మందులు అందజేస్తున్న కృష్ణారెడ్డి

ఇళ్లు సరే.. వసతులేవి?

- గత ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూంల కేటాయింపు
- 8 నెలలు గడుస్తున్నా సదుపాయాలు కరువు
- అద్దె ఇళ్లల్లోనే లబ్ధిదారులు


రోడ్డు పక్కనే ఎస్టీపీ నిర్మాణం

నిజాంపేట్: డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయిస్తూ గత ప్రభుత్వం సంబంధిత పత్రాలను లబ్ధిదారులకు అందజేసింది. కానీ అందులో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు అద్దె ఇళ్లల్లోనే కాలం వెల్లదీస్తున్నారు. అధికారులు తాగు నీరు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయలేకపోయారు. ఇండ్లు కేటాయించి ఎనిమిది నెలలు గడుస్తున్న మౌలిక వసతులు కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. బాచుపల్లి మండలంలోని నిజాంపేట్‌లో 1440 ప్లాట్స్, బాచుపల్లిలో 1080 ప్లాట్స్ నిర్మించారు. విద్యుత్ లైన్లను సైతం పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్‌ల పనులు మొదలు పెట్టారు.

స్విమ్మింగ్‌పూల్‌గా సెల్లార్లు

ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వరద నీరు సెల్లార్‌లలోకి చేరి సెల్లార్లు అన్నీ స్విమ్మింగ్ పూల్‌ను తలపిస్తున్నాయి. దీంతో డబుల్ బెడ్ రూం భవనాల పిల్లర్లు దెబ్బతినే ప్రమాదం ఉందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. సెల్లార్‌లల్లో చేరిన వరద నీటిని కూడా తొలగించే ఏర్పాట్లు చేయడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పవచ్చు.

రోడ్డు విస్తరణకు అడ్డుగా ఎస్టీపీ నిర్మాణం!

నిజాంపేట్ వాటర్ ట్యాంకు నుంచి జర్నలిస్టు కాలనీ, డబుల్ బెడ్ రూంల సముదాయం నుంచి తెలుగు విశ్వవిద్యాలయం మీదుగా బాచుపల్లి విజ్ఞాన జ్యోతి స్కూల్ వరకు హెచ్ఎండీఏ 100 ఫీట్ల రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సైతం అందుకోసం ఏర్పాట్లు చేసింది. కానీ డబుల్ బెడ్‌రూం నిర్మిస్తున్న అధికారులు మాత్రం రోడ్డు పక్కనే డబుల్ బెడ్ రూం సముదాయాల డ్రైనేజీ లైన్ వేసి రోడ్డు పక్కనే ఎస్టీపీ నిర్మాణం చేశారు. దీంతో త్వరలో నిర్మించే 100 ఫీట్ల రోడ్డు మధ్యలో ఈ ఎస్టీపీ వచ్చే అవకాశం ఉంది. మరి ఇలాంటి పరిస్థితిలో అధికారులు స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కానీ, మేయర్ నీలా గోపాల్‌రెడ్డిని కానీ సంప్రదించి సమన్వయం చేసి ఉంటే బాగుండేది. భవిష్యత్‌లో రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించాల్సి వస్తే డబుల్‌బెడ్ రూం వాసులకు ఇబ్బంది. నిధులు దుర్వినియోగం చేసినట్లు అవుతుందని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు.

చెత్త డంపింగ్‌ను తరలిస్తారా?

డబుల్ బెడ్‌రూంల సముదాయాన్ని ఆనుకునే చెత్త డంపింగ్ కేంద్రం ఉంది. ప్రతి రోజు 120 టన్నుల వరకు చెత్తను వివిధ కానీల నుంచి, బస్తీల నుంచి సేకరించి ఇక్కడ వేస్తారు. మరి ఇప్పటికే డంపింగ్ యార్డుకు కిలో మీటర్ నుంచి రెండు కిలో మీటర్ల వరకు దూరంలో ఉన్న కాలనీల్లో, బస్తీల్లో దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా చెత్త తగులబడ్డప్పుడు వ్యర్థ రసాయనాలు వెలువడి ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో డబుల్ బెడ్ రూం నివాసుల పరిస్థితి ఏంటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. తాము ఇండ్లల్లో చేరకముందే డంపింగ్ యార్డును తొలగిస్తే బాగుంటుందని వారు అభిప్రాయడుతున్నారు.




రోడ్డు పక్కనే ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ లైన్


వరద నీటితో సెల్లార్

పై అధికారులు వేధిస్తున్నారు.. ఆత్మహత్యే శరణ్యం

బాలానగర్ తహసీల్దార్ కార్యాలయ అటెండర్ అనిల్

బాలానగర్: మండల కార్యాలయంలోని ఓ సీనియర్ అసిస్టెంట్, తహసీల్దార్ వై శ్రీనివాసులు తన ఆరోగ్య పరిస్థితిని చూడకుండా వేధింపులకు పాల్పడుతున్నారని అటెండర్ అనిల్ ఆవేదన వ్యక్తం చేశాడు. బుధవారం సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గంజాయి కేసులో పంచనామా నిర్వహించేందుకు వాకర్ సాయంతో వచ్చిన అటెండర్ అనిల్‌ను చూసి పలువురు మీడియా ప్రతినిధులు పలకరించారు. ఆరోగ్యం బాగోలేకపోయినా విధులు ఎందుకు నిర్వర్తిస్తున్నారని ప్రశ్నించగా, తనకు యాక్సిడెంట్ అయిందని అనిల్ వివరించాడు. తీవ్ర అనారోగ్యంతో కూడా చిన్నచిన్న పనులు చేస్తున్నానని, అయినా కూడా తహసీల్దార్ తనను వేధిస్తున్నారని ఆరోపించాడు. వేధింపులు తాళలేకపోతున్నానని, ఇక తహసీల్దార్ శ్రీనివాసులు, ఓ సీనియర్ అసిస్టెంట్ పేర్లు రాసి ఆత్మహత్య చేసుకోవడమే తనకు శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

అలాంటిదేమీ లేదు..

అనిల్‌పై జరుగుతున్న వేధింపులపై బాలానగర్ తహసీల్దార్ శ్రీనివాసులును మీడియా వివరణ కోరగా.. అనిల్‌పై ఎలాంటి వేధింపులు లేవని వివరించారు. జీతం సక్రమంగానే ఇస్తున్నామని, ఆఫీస్‌కు వచ్చి కేవలం కుర్చీలో కూర్చుంటాడని, ఎలాంటి ఇబ్బంది పెట్టట్లేమని పేర్కొన్నారు. కాగా, పంచనామా గురించి కిందిస్థాయి సిబ్బందికి చెప్పగా, అనిల్‌ను పంపించి ఉంటారని తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029